పురుషులకు ప్రత్యేకం

బహుమతి పొందిన కథ



# 'కర్తవ్యం నీవంతు'

– పినిశెట్టి శ్రీనివాసరావు

కొడుకు దగ్గరకు వెళ్ళొచ్చినప్పటినుండీ, సావిత్రమ్మ గారు ముభావంగా అదోలా వుండటం భర్త సత్యనారాయణ గారు గమనిస్తూనే వున్నారు.

పిచ్చిది-చిన్నప్పటినుండీ అంతే, కొడుకంటే వల్లమాలిన ప్రేమ. పోనీ మరో నెల్రోజులు అక్కడేవుండి రావొచ్చుగా. ఊహు! అక్కడుంటే ఇక్కడ-ఇక్కడుంటే అక్కడ. ఎక్కడా మనసు నిలవదు. అప్పటికీ ఊరెళ్ళే ముందు మరీ మరీ చెప్పివంపించాడు తను-"వాడి ఆరోగ్యం పూర్తిగా బాగుపడ్డాకే రా. నాకేదో ఇబ్బంది కల్గుతుందని తొందరపడి పరుగెత్తుకురాకు. నువ్వుదగ్గరుంటే అబ్బాయికి కాస్త ధైర్యంగా వుంటుంది." అని, ఎన్ని చెప్పినా దాన్ని మార్చటం ఎవరితరంకాదు. కొడుకు మీద మమకారం చంపుకోలేదు. భర్త కష్టపడితే సహించలేదు. అనలీ ఆడవాళ్ళంతా అంతే, సెంటిమెంట్స్‌తో సమస్యలు సృష్టించుకుంటుంటారు. కట్టుకున్నాక తప్పుతుందా? నిట్టూర్చారు సత్యనారాయణగారు.

రెండ్రోజులు పోయాక భార్యప్రక్కన కూర్చుంటూ మెల్లగా అన్నారు సత్యనారాయణగారు-"అబ్బాయి ఆరోగ్యం ఎలావుంది. పూర్తిగా కోలుకున్నాడా. భోజనం సరిగ్గా చేస్తున్నాడా?" అని.

"లేదండీ..ఇంకాపూర్తిగా కోలుకోలేదు పత్యం భోజనం చేస్తున్నాడంతే. పచ్చకామెర్లంటే మాటలా? పత్యంతోటే రోగాన్ని తగ్గించుకురావాలి. మరో నెళ్ళాళ్లయినా జాగ్రత్తగా వుండాలట" కొడుకు ఆరోగ్యం గురించి సావిత్రమ్మ పడుతున్న ఆందోళన ఆమె మాటల్లో స్పష్టంగా కన్పడుతోంది.

"మరేం తొందరపడి వచ్చేశావ్? మరో పదిరోజులన్నా వుండి రాపోయావా?"

"నేనుండి మాత్రం చేసేదేముంది చెప్పండి... కోడలు పిల్లే అన్నీ శ్రద్ధగా చూసుకుంటోంది."

ఎప్పుడూ కొడుకు అని కలవరించే సావిత్రమ్మ ఇట్లా మాట్లాడుతుందేవిటా అనుకున్నారు సత్యనారాయణగారు.

"ఇకనుంచి నేనూ మీతోపాటు రోజూ సాయంత్రం రామమందిరానికి వస్తాను. శాస్త్రులుగారి పురాణకాలక్షేపం వినాలని కోరికగా వుంది," అంది ఓరోజు సావిత్రమ్మ భర్తతో.

సత్యనారాయణగారు భార్యలో వస్తున్న మార్పుకు మొదట ఆశ్చర్యపోయినా—తర్వాత— ఈ వయసులో ఆధ్యాత్మిక చింతన రాక మానుతుందా? అనుకున్నారు.

రోజూ సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో రామమందిరానికి వెళ్ళి, తొమ్మిది,తొమ్మిదిన్నర ప్రాంతంలో, పురాణ కాలక్షేపం ఆలకించి, ఇద్దరూ కలిసి ఇంటికి చేరుకోవటం వారి దినచర్యలో ఒక భాగమైపోయింది.


ఇరవై వయసునుంచి - అరవై వయసు వరకు ప్రతిమనిషి జీవితంపిల్లలు పుట్టటం, వాళ్ల చదువులు - ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు- ఇత్యాది బాధ్యతలతో నిండిపోతుంది. వయసు అరవై చేరుకునేటప్పటికి శరీరం - మనసూ రెండూ అలసిపోయినట్లనిపిస్తుంది. రెక్కలొచ్చిన పిల్లలు ఎగిరిపోతారు. మిగిలిపోయిన వృద్ధ జంటకు ఏదో వొంటరిభావన. సొంతపిల్లలు పరాయివాళ్ళయిపోయారన్న బాధ, పిల్లలమీద పెంచుకున్న ప్రేమానురాగాలు చంపుకోలేక మనసుపడే ఆవేదన. శేషజీవితం ఎలాగడుస్తుందో అన్న ఆలోచన, ఈ వొత్తిళ్ళను తట్టుకుని నిలబడాలంటే మార్గం-అదే భక్తిమార్గం-దైవ చింతన-భగవన్నామస్మరణ-గడచిన అరవై యేళ్ళ జీవితం బరువు బాధ్యతలతో మనిషిని ఉక్కిరిబిక్కిరి చేసి-నిరంతర శ్రమకు - వొత్తిళ్ళకు గురిచేసి మనిషికి మిగిల్చింది ఏవిటి? అస్థిరత, అశాంతి, ఆందోళన, ఇక ఇప్పుడు కావల్సింది విశ్రాంతి-సంపూర్ణవిశ్రాంతి. ఈ సమస్త ప్రాణికోటిని పరిరక్షించే ఆ భగవంతుడే ఈ జీవికి ముక్తిని మోక్షాన్ని ప్రసాదించగలడని అప్పటికిగాని అర్థంకాదు ఈ జీవికి. ఇదే మనిషి జీవితంలో చరమదశ. ఇదే మనశ్శాంతికి మార్గం.

గడచిన నెల్రోజుల్లో సావిత్రమ్మ కొడుకు గురించి తలవనైనా తలవకపోవడం-భార్యలో వస్తున్న గణనీయమైన మార్పుగా గుర్తించారు సత్యనారాయణగారు.

ఈ మార్పు శాశ్వతమోకాదో పరీక్షిద్దామనుకున్నారు ఆయన ఒకరోజు.

"అబ్బాయి ఊసే ఎత్తటం లేదు — మర్చిపోయావా ఏమిటి?" అన్నారు భార్యతో.

"పెళ్ళిళ్లయి వెళ్ళిపోయాకకూడా, పిల్లలు-పిల్లలు



అని వెంటవస్తామా ఏవిటండీ? వాడికి పెళ్ళాం బిడ్డలున్నారు వాడి మంచిచెడ్డలు చూసుకోవటానికి. ఈ వయసులో మనం మాటసాయమే కాని — పని సాయం చేయగలమా చెప్పండి? అలాంటప్పుడు ఊ.. అంటే అబ్బాయి ఇంటికి ప్రయాణంకట్టే వాళ్ళకు శ్రమ కల్గించిన వాళ్ళమే అవుతాముకాని, సాయపడేవాళ్ళం కాదు," అంది సావిత్రమ్మ.

"నీ ఆలోచనా విధానంలో చాలా మార్పొచ్చింది సావిత్రీ" అన్నాడు సత్యనారాయణగారు భార్యవంక మెచ్చుకోలుగా చూస్తూ.

"నిజమేనండి — నాలోవచ్చిన మార్పు నాకూ తెలుస్తూనేవుంది. మీకు గుర్తుందా... రాజుగాడ్ని చిన్నప్పుడు ఎలిమెంటరీ స్కూల్లో వేసినప్పుడు, నాకొంగుపట్టుకుని వదిలేవాడు కాదు. టీచరమ్మ వచ్చి క్లాసులోకి రమ్మని బలవంతపెట్టినా.... అమ్మా...అమ్మా... అంటూ నన్ను చుట్టుకు పోయేవాడు. వాడికోసం ఎన్నిరోజులు ఆపిల్లల్తోపాటే నేనూ క్లాసుల్లో కూర్చుండిపోయేదాన్ని! ఆఖరుకు ఒకరోజు హెడ్మాస్టారు చూసి, "మీరలా వున్నంతకాలం మీ అబ్బాయి ఇలా చేస్తూనే వుంటాడు. మీరెళ్ళిపోండి," అని నన్ను స్కూలునుంచి పంపించేసినప్పుడు, వాడు పెట్టిన అల్లరి ఇంతా అంతానా? టీచర్ని — కాళ్ళతో చేతుల్తో ఎలా తన్నిపారేశాడని... ఆతర్వాత ఆరోక్లాసుకు వచ్చేంతవరకు ఊరు మారినప్పుడూ—స్కూలు మారినప్పుడూ మళ్లీ కొత్తవాడికి...'అమ్మ చాటుబిడ్డ" అని అందరూ వాడ్ని చూసి నవ్వేవారు కాదూ! రోజూ స్కూలుకు వెళ్ళేటప్పుడు 'మమ్మీ టాటా.. మమ్మీ టాటా' అంటూ నందు మలుపు తిరిగేంత వరకూ వెనక్కు తిరిగి చెయ్యి ఊపుతూ-అరుస్తూ, చూసేవాళ్ళకి ఎవిటీ ఈ పిల్లాడికి తల్లంటే ఇంత ఇష్టం అనుకొనేలా... వాడి హోంవర్కు పూర్తయ్యేవరకూ ఎంతరాత్రైనా వాడితోపాటు నేనూ మేల్కొనే దాన్ని గుర్తుందా... 'చేతులు నొప్పులు నొడున్నాం - మమ్మీ' అన్నప్పుడు వాడి నోట్సులు నేను రాసేదాన్ని మీరొద్దంటున్నా... మీకు తెలీకుండా వాడు శనగలు, బఠానీలు, ఐస్‌ఫ్రూట్ వగైరా కొనుక్కుంటానంటే చిల్లర డబ్బులు ఇచ్చేదాన్ని. కార్తీకమాసం పిక్నిక్‌కి స్నేహితుల్తో వెళ్తానంటే - మీరు పంపనన్నా నేను కాదనలేకపోయేదాన్ని.

"హైస్కూల్లో చదువుతున్నప్పుడు స్నేహితులతో సినిమా కెళ్తానంటే నాదగ్గర డబ్బులు ఇచ్చి పంపేదాన్ని. వాడికి సుస్తీ చేస్తే నేను నిద్రాహారాలు మానేసేదాన్ని. కాని... కాని... రేప్రొద్దున్న పెద్దయ్యాకవాడు మనల్ని అందలమెక్కిస్తాడని, అవసరానికి ఆదుకుంటాడని... మనం పోయాక తలకొరివిపెట్తాడని... ఆశించి స్వార్థంతో చేసినవి కావండీ ఇవన్నీ. మనకు పుట్టిన ఒక్కగానొక్క బిడ్డ. వాడి సంతోషం, ఆనందమే - మన ఆనందమూ నూ అందుకే... అందుకేనండీ...." ఒక్కసారిగా సావిత్రమ్మగారి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. గొంతు జీరబోయింది.

సత్యనారాయణగారు ఖంగారుపడ్డారు. భార్యను దగ్గరకు తీసుకొని చెంపలపై జాలువారుతున్న నీటిబిందువులను తుడిచారు.

"ఊరుకో సావిత్రీ ఊరుకో.... నీమనసు బాధపెట్టాను," అన్నారు సత్యనారాయణగారు, అనవసరంగా కొడుకు విషయం ఎత్తి భార్యను బాధపెట్టానన్నా తలంపుతో.

"లేదండీ బాధేంలేదు-కాకపోతే గతస్మృతులు తల్చుకుంటున్నానంతే మనం ఆనాడు అనుభవించిన ఆనందాన్ని అనుభూతినే ఈనాడు మన అబ్బాయి తన భార్యాబిడ్డలతో పొందుతున్నాడు. అప్పుడువాడు మన బిడ్డ మాత్రమే. ఇప్పుడు ఒకస్త్రీకి భర్త - తన పిల్లలకు తండ్రీవాడు. అన్నింటికన్నా వాడి భార్యాబిడ్డల ఆనందమే వాడికి ఇప్పుడు ముఖ్యం. మరి మధ్యలో మనం యిమడాలను కోవటం ఏం సబబు చెప్పండి. కొత్త నీరొస్తే పాతనీరు కొట్టుకుపోతుంది.

"అందుకనీ, మనకి వాడ్ని చూడాలనిపించినప్పుడు కాకుండా వాడికి మనల్ని చూడాలనిపించినప్పుడే మనం వాడి ఇంటికి వెళ్తే ఆ కలయికలో ఆనందం ఉంటుంది. పిలవని పేరంటానికి వెళ్ళి మర్యాద చెయ్యలేదని వాపోతారా చెప్పండి ఎవ్వరైనా?"

"భగవంతుని దయవలన మనకు కల్గిన ఒక్కగానొక్కబిడ్డ-పెళ్ళాంబిడ్డలతో సుఖంగా వున్నాడు. ఎప్పుడో ఒకప్పుడు అనారోగ్యం ఎవరికైనా వస్తుంటుంది - పోతుంటుంది. జీవితం అన్నాక కష్టసుఖాలు రెండూ వుంటాయి. అయిందానికి కానిదానికి మనం ఈ వయసులో మనసు పాడుచేసుకోవటం ఉచితం కాదు. ఇంకెన్నేళ్ళు బ్రతుకుతామో ఎవరుచూడొచ్చారు? ఈ శేషజీవితాన్నైనా ప్రశాంతంగా కృష్ణా-రామా అనుకుంటూ గడిపేద్దాం- మనల్ని చూడాలనుకున్నప్పుడు అబ్బాయి-కోడలు, పిల్లలు వచ్చిపోతుంటారు. ఇకమీదట నాకు మీరు - మీకు నేను-మనిద్దరికీ ఆ భగవంతుడున్నాడు."

సత్యనారాయణగారు హిప్నాటైజ్ చేయబడినట్లు సావిత్రమ్మగారు చెప్తున్నంతసేపూ ఆమె ముఖంలోకి తదేకంగా అలా చూస్తూనే వుండిపోయారు. ఆమె చెప్పటం ఆపినవెంటనే, తేరుకొని, "నో... సావిత్రి తను అనుకొన్నట్లు పిచ్చిది-అమాయకురాలుకాదు. ఇన్నేళ్ళ జీవితంలో తనకుకూడా ఆమె హృదయపులోతులు అర్థం కాలేదంటే తను ఆమె ముందు తీసికట్టు. ఇప్పుడు ఒప్పుకొంటున్నాను—స్త్రీ 'సెంటిమెంట్స్' వెనుకవుండే మనోభావాలు పురుషుడికి అంత సులభంగా అర్థం అయ్యేవికావు. అందుకే అన్నారు. 'అగాధమైనది స్త్రీ హృదయం' అని.

'సావిత్రి చెప్పిందాంట్లో ఎంతో నిజంవుంది. ఓమొక్కను నాటి, నీళ్ళుపోసి, పోషణ చేసి పెంచుతాం. అది పూతకొచ్చి — కాపుకొచ్చే సమయానికి ఆ చెట్టు మన అధీనంలో వుంటే ఆ ఫలాన్ని మనం అనుభవిస్తాం — లేదంటే లేదు. దేనికైనా ప్రాప్తం వుండాలి. ఫలితందక్కినా దక్కకున్నా, మన బాధ్యత-మనవంతు కర్తవ్యం మనం సక్రమంగా నిర్వహించాలి.... కర్తవ్య నిర్వహణలోనే అన్నిటికీ మించిన ఆనందంవుంది. అందుకోసమేగా ఈ జీవనయాత్ర...' అనుకున్నారు సత్యనారాయణగారు.




# ఆనందం ఖరీదు ఐదు వేలు

- భార్గవి పి.రావు

పెళ్ళి పందిరి పచ్చగా కలకలలాడుతోంది. పట్టు చీరల అందాలు వాటి మీదుగా తేలివచ్చే గంధపు వాసనలు, వాటితో పోటీ పడుతున్న తాళింపు ఘుమఘుమలు-ఉక్కిరిబిక్కిరైపోతున్నాడు శేఖరం; చాలా కావలసిన వాళ్ళు, దగ్గిర చుట్టాలు రాకపోతే బావుండదని పట్టుపట్టి తీసుకొచ్చిన శేఖరం తల్లి సుగుణమ్మగారు ఆమె వేలువిడిచిన మేనత్త, బావమరిది తమ్ముడిపెళ్ళాంతో బాతాఖానీలో మునిగిపోయారు. భార్య కమల, ఎవరో తన ఈడు వాళ్ళతో తను కట్టుకున్న కంచిపట్టు చీర ధర గురించి, పెళ్ళిలో పెట్టిన నగల బరువు గురించి కాబోలు కళ్ళూ చేతులు తిప్పేస్తూ కబుర్లు చెప్పేస్తోంది. విసుగ్గా అనిపించింది శేఖరానికి. తెలిసిన మొహాలేవీ కనిపించలేదు. పెళ్ళి ముహూర్తం ఎప్పుడో అయిపోయింది. వడ్డనకు యింకా టైముంది. దూరంగా కుర్రాళ్ళ గుంపు కనిపించింది. వెళ్ళి మాటలు కలుపుదామనుకున్నాడు. కాని మరీ చిన్న వాళ్ళలా, కాలేజీ కుర్రాళ్ళా అనిపించారు.

మళ్ళీ కమల కేసి చూశాడు. కానీ ఆమె ఏదో ప్రపంచంలో పడి మొగుడన్న వాడున్నట్టుగ్గానే మరచిపోయినట్టుంది. హు, అయినా తన ఖర్మ. పెళ్ళయి ఏడాది కూడా కాలేదు. అప్పుడే అంతా పాతబడి చప్పగా అయిపోయింది. ఎప్పుడు కబుర్లు చెప్పినా పత్రికల్లో సీరియల్సు టీవీ ప్రోగ్రాములు, సినిమా, యిరుగు పొరుగు కబుర్లు తప్పించి ఒక సంగీతం గురించిగాని, సాహిత్యం గురించికానీ మాట్లాడదు. రాజకీయపరిజ్ఞానం బొత్తిగా లేదు. బలవంతంగా పేపరు చదివించినా తనకు ఆక్సిడెంట్లు, దొంగతనాలు తప్పవేరే వార్తలు కనిపించవు. "అయినా అమెరికా ఆర్థికమంత్రి ఎవరయితే ఏమండీ, మనకేమన్నా కందిపప్పు చవగ్గా యిస్తాడా" అని చచ్చుజోకు లేస్తుంది. అందుకని పెళ్ళయిన నెల్లాళ్ళకే సర్దుకుపోవడం నేర్చుకున్నాడు.

మనరకం పెళ్ళిచూపుల్లో మనుషుల్ని అంచనా వేయడానికి నూటిలో ఒకటో వంతు కూడా ఛాన్సు ఉండదు. శేఖరానికి ప్రేమ వివాహాలపైన గట్టిగా నమ్మకం ఉండేది. కాలేజీలో చదువు కునేటప్పుడు, ఒకళ్ళనొకళ్ళ తెలుసుకొని అభిరుచులు కలవకపోయినా ఒకరి భావాలను ఒకరు గౌరవించేలా వుండాలి అనుకునేవాడు. వేదికలెక్కి వుపన్యాసాలివ్వకపోయినా ఎదుటి వ్యక్తిని గౌరవించే సంస్కారం వున్న అమ్మాయి-మరీ అందగత్తె కాక పోయినా ఫరవాలేదు అని వెదికేవాడు. అతని ప్రయత్నం సఫలం కాకుండానే కమల సంబంధం కుదిరిపోయింది "పిచ్చి పిచ్చి వేషాలెయ్యకు జాతకం కుదిరింది, సాంప్రదాయమైన కుటుంబం. ఒక్కతే కూతురు. బాగా ముద్దుముచ్చటా జరుపుతారు. ఇరవై వేలు కట్నం. అమ్మాయి కూడా బొద్దుగా, ముద్దుగా వుంది" అని మరో మాట మాట్లాడనీయకుండా పెళ్ళి దాకా తీసుకొచ్చేసారు తల్లీతండ్రీ. పెళ్ళి చూపుల్లో కమల నచ్చలేదనడానికి పెద్ద కారణాలు కనిపించలేదు. కాదనడానికి అతని దృష్టిలో వేరే అమ్మాయిలు లేరు. అలా ఓ ఇంటివాడయ్యాడు శేఖరం. అప్పుడే ఏడాదయిపోయింది.

ఊహల్లోంచి బయటపడి మళ్ళీ అటూ యిటూ చూపులు సారించాడు. తల్లి తనను చూపించి ఏదో చెప్తోంది పక్కనున్నావిడతో. బాంకులో మేనేజరు, రెండు వేలు జీతం అనికాబోలు. నవ్వుకున్నాడు. అంతలో వెనక నుండి ఎవరో మెత్తగా నవ్వినట్టు వినిపించింది. తిరిగి చూసాడు. ఎవరో ముగ్గురు అమ్మాయిలు. అలా వెడుతూ ఏదో చెప్పుకుని నవ్వుకుంటున్నారు. అలా కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయాడు శేఖరం. ఆ మధ్య నున్న అమ్మాయి ఎంతనాజుగ్గా, ఎంత అందంగా వుంది. ఎంత సమ్మోహనంగా ఉందా నవ్వు. కళ్ళలోని మెరుపు నవ్వుతో పోటీపడుతోంది. బుగ్గలు అసూయతో సొట్టలుబడ్డాయి. మొహం ఎర్రగా అయిపోయింది. ఒళ్ళు కొంచెం ఒయ్యారంగా ఊగి ఆగిపోయింది. ఆవూపులో సన్నటి నడుము తన అందాన్నంతా వెలిగించింది. పొడుగాటి జడ శేఖరం మనస్సులా వూగుతోంది.

అరే అదేమిటి ఎవరో అమ్మాయిని చూసి అలా మైమరచి పోతున్నాడు అనుకుని తనంతటతనే నొచ్చుకున్నాడు శేఖరం. ఆ అమ్మాయి అలా వెళ్ళిపోతూ తన పెద్ద కళ్ళను ఒకసారిగా అందంగా తిప్పి చూసింది ఎందుకో. శేఖరం గుండె ఒక్కనిమిషం కొట్టుకోవడం ఆగినట్టనిపించింది. ఆ అమ్మాయి పేరు హారిణి అయితే బావుణ్ణు అనుకున్నాడు. అతని ఆలోచనలు చెదరిపోయాయి. కమల కబుర్లు అయిపోయినట్టున్నాయి. శేఖరం వైపు నడచి వస్తోంది. ఆమెవైపే తదేకంగా చూసాడు శేఖరం. పెళ్ళిలో కాస్త బొద్దుగా అనిపించిన కమల యిప్పుడు ఇంకా ఒళ్ళుచేసి లావుగా అయింది. అలంకరణలో అతిశయోక్తి, నవ్వులో ఒకింత గర్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. "ఏమిటండీ అలా చూస్తున్నారు కొత్తపెళ్లి కూతుర్ని చూస్తున్నట్టు. నలుగురూ చూస్తే

**తమ అభిరుచులకు, భిన్నమైన వ్యక్తితో సంసారజీవనం పెనవేసుకుపోయినప్పుడు సర్దుకు పోవడం తప్ప మరో మార్గం లేదన్నది నిజమే. కానీ, తన ప్రమేయం లేకుండా కేవలం కట్నంలో వచ్చిన తేడా వల్లే తన జీవితంతో రాజీపడాల్సి వస్తోందని అతనికి తెలిసినప్పుడు....**

ఏమనుకుంటారు" అంది కొద్దిగా సిగ్గుపడుతూ కమల.

"కబుర్లు అయిపోయాయా? భోజనాలెప్పుడు? త్వరగా బయలుదేరు. ఎవరితో మాట్లాడుతున్నావు?" అని అడిగాడు శేఖరం.

"పెళ్ళికొడుకు వదినగారు తాలుకుటండీ, మావురి వాళ్ళే. మావాళ్ళంతా బాగా తెలుసుట" అని ఏదో చెప్పబోతుంటే -

"ఆవిడకాదు. ఆ నీలంచీర కట్టుకున్నమ్మాయి. ఎక్కడో చూసినట్టుగా ఉంటేనూ...." అని యధాలాపంగా అడిగినట్టుగా అడిగేడు.

కమల తిరిగి చూసింది అప్పటికే ఆ అమ్మాయి లోపలికి వెళ్లిపోయింది. "ఏమో, నాకేం తెలును", అని విరుపుగా అని, అనుమానంగా శేఖరం వేపు చూసింది. శేఖరం కూడా జాగ్రత్తపడి మాటమార్చేసాడు. అంతలో భోజనాలకు పిలుపులందేయి. అందరూ లేచారు.

బంతిలో కూడా ఆ అమ్మాయి రెండుమూడుసార్లు కనిపించింది. ఓసారి నెయ్యి వడ్డిస్తూ, మరోసారి మంచి నీళ్ళు తాగుతూ. చెయ్యికడుక్కుని వస్తూంటే పెళ్ళి కూతురుతో సరసమాడుతున్నట్టుంది. ఎంత అందంగా నవ్వుతోంది. వీణమీటినట్టుగా, ముత్యాలు కలబోసినట్టుగా - బలవంతంగా కళ్ళు తిప్పుకున్నాడు.

అంతలో శేఖరం తల్లి సుగుణమ్మగారు మరో పెద్దావిడతో కలసి అటుగా వచ్చారు. అమ్మ యధాలాపంగా పరిచయం చేస్తూ "వీడేనండీ మారెండో అబ్బాయి మొన్నటేడాది పెళ్ళయిందన్నానే" అంది.

"అలాగా నాయనా, సంతోషం. పిల్లలా? ఏమిటో మాకురాసి పెట్టలేదు. లేకపోతే మా మేనకోడల్నే పెళ్ళాడేవాడు. ఈసారి అమలాపురం వస్తే తప్పకుండా మాయింట్లో నాలుగురోజులుండాలి వదినా. వస్తాను" అంటూ అప్పగింతలు పెట్టి ముందుకు వెళ్ళింది.

"ఎవరే అమ్మా ఆవిడ అలా అంటోంది" అన్నాడు శేఖరం చిరాగ్గా.

"పోనిలేరా. పెద్దావిడ. పాతకాలం వాళ్ళంతా అంతే. వాళ్ళ మేన కోడల్ని నీకు చేసుకోమని అడిగారు. జాతకాలు కూడా కలిసాయి. కాని పదిహేనువేల కంటే యిచ్చుకోలేమన్నారు. అందుకని మీనాన్నగారు కమల వాళ్ళ సంబంధం ఖాయం చేసారు. ఆ అమ్మాయి కూడా ఇక్కడే తిరుగుతోంది చూసావా? అదిగో, అటు, ఆ నీలం చీరలో ఉన్న అమ్మాయి" అని చూపించింది.

శేఖరం గుండె గట్టిగా కొట్టుకుంది ఒక్క నిమిషం. ఆ అమ్మాయే! పేరు హారిణే అయివుంటుంది. అందంగా నవ్వుతూ ఏదో అంటూంది నన్నగా.

"ఏమిటండీ ఆలా నిలబడి పోయారు. భోజనాలయ్యే వరకు తొందర పెట్టి యిప్పుడు ఆలస్యం చేస్తున్నారు. బయలుదేరండి " అని గట్టిగా కమల అంటుంటే అందరూ తన్నే చూస్తున్నట్టుగా అనిపించింది శేఖరానికి. తలొంచుకుని, గబగబ కమల వెనకే నడిచాడు. కమలను చూస్తూంటే ఎందుకో కోపం వచ్చింది శేఖరానికి. కమల మాట, నడక నవ్వూ, ఆఖరికి పేరూ, ఏది నచ్చినట్టనిపించలేదు. ఆమె తెచ్చిన ఇరవై వేల కట్నం కళ్ళ ముందు కదిలింది. కుదరని హారిణి సంబంధం గుర్తొచ్చింది. పదిహేనువేల కంటే యివ్వలేనంటే ఆ సంబంధం తిరగ్గొట్టారా?

తన ఆనందం ఖరీదు ఐదువేలా అనుకుంటూ నిట్టూర్చి ముందుకు నడిచాడు శేఖరం.

రచయిత్రి చిరునామా;
డా॥భార్గవి పి.రావు
'పాంచజన్య'
70,ఎమ్.ఐ.జి.హెచ్.
న్యూ సంతోష్‌నగర్‌కాలనీ
హైద్రాబాద్ - 500 657